క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



అయిజ: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు పట్టణంలోని బ్రైట్‌స్టార్ పాఠశాల విద్యార్థి కృపాసాగర్ ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎస్సేరు తెలిపారు. హైదరాబాద్‌లోని దోమలగూడలో ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న 68వ స్కూల్ గేమ్స్‌లో అండర్-14 విభాగం ఖోఖో పోటీల్లో కృపాసాగర్ పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థికి పలువురు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ దివ్య జ్యోతి, వ్యాయామ ఉపాధ్యాయుడు సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి భక్తుల పాదయాత్ర

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు శుక్రవారం శ్రీశైలం క్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరారు. శివమాల దారులు ఇరుముడి ధరించి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మానవపాడు నుంచి శ్రీశైలానికి వెళ్లారు.

ముమ్మరంగా సమగ్ర సర్వే



మల్దకల్: ప్రభుత్వం నిర్దేశించిన గడువు ముగుస్తుండటంతో సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యుమరేటర్లు గ్రామాల్లో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని అమరవాయి, బిజ్వారం, ఉలిగేపల్లి, తాటికుంట, విఠలాపురం, ఎల్కూరు, మల్దకల్, పెద్దొడ్డి గ్రామాల్లో ఇంటింటికి తిరిగి సర్వే చేశారు. సర్వేను సూపర్‌వైజర్లతో పాటు ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్‌లు పరిశీలించారు. ప్రజలు ఎన్యుమరేటర్లకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలని ఎస్పీకి వినతి

గద్వాల అర్బన్: ఇసుక అక్రమ దందాపై కథనం రాసిన పత్రికా విలేకరిని దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడిన ఇసుక వ్యాపారి మహేందర్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కేంద్రంలోని జర్నలిస్టులు శుక్రవారం ఎస్పీ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. విలేకర్లకు రక్షణ కల్పించాలని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు కోరారు.

80 శాతం రైతులకు రుణమాఫీ కాలేదు



మానవపాడు: రాష్ట్రంలో 80 శాతం మంది రైతులకు రుణమాఫీ రాలేదని జిల్లా బీజేపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో క్రియాశీల సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గద్వాల జిల్లాలో 593 పోలింగ్ బూత్‌ల్లో క్రియాశీల సభ్యత్వాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తరఫున ప్రతి గ్రామంలో పోటీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజశేఖర్‌శర్మ, మురళీకృష్ణ, బలరాంరెడ్డి, లక్ష్మీనారాయణ, జగన్‌గౌడ్, రాజు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో వరిగడ్డి దగ్ధం



అయిజ: విద్యుదాఘాతంలో పశుగ్రాసం దగ్ధమైన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. సంకాపురం గ్రామానికి చెందిన నరసింహులు గట్టు మండలం మాచర్ల నుంచి పశుగ్రాసం (వరిగడ్డి) కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై తీసుకొస్తుండగా సంకాపురం గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు తగిలి పశుగ్రాసం దగ్ధమైంది. ట్రాక్టర్ డ్రైవర్ రామకృష్ణ అప్రమత్తమై ట్రాలీలో ఉన్న వరిగడ్డిని లిఫ్ట్ సహాయంతో కిందకు తోసేశాడు. రూ. 10 వేలు విలువ చేసే పశుగ్రాసం దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు

రహదారులు.. ప్రమాదాలకు నిలయాలు

- అధ్వానంగా మారిన రహదారులు
- కంకరతేలిన రోడ్లలో వెళ్లలేని పరిస్థితి

శాంతినగర్ : అసలే అంతంతమాత్రాన ఉన్న రోడ్లు, ఆపై భారీ వాహనాల నిత్యం రాకపోకలతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. దీంతో బీటీ రోడ్లు మట్టిరోడ్లను తలపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, వడ్డేపల్లి, రాజోళి మండలాల్లో భారత్‌మాల రోడ్డు పనులు జోరుగా సాగుతున్నాయి. ఆరులైన్ల రహదారి నిర్మించేందుకు ఆయా మండలాల్లోని గట్లు, తిప్పల నుంచి ఎర్రమట్టిని సేకరిస్తున్నారు. అంతేగాక క్రషర్స్ ఏర్పాటు చేసి కంకర తరలిస్తుండటంతో భారీ వాహనాలు తిరుగుతూ గతంలో ఉన్న బీటీరోడ్లు పూర్తిగా పాడై మట్టిరోడ్లగా మారాయి. దీంతో ప్రమాదాలకు అలవాలంగా మారాయి. దుమ్ము, ధూళితో అనారోగ్యం బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

మట్టిరోడ్లను తలపిస్తున్నాయి..

వడ్డేపల్లి మండల పరిధిలోని తనగల నుంచి వెంకటాపురం వరకు ఉన్న బీటీరోడ్డు భారీ మట్టి టిప్పర్లు, కంకర టిప్పర్లు తిరుగుతూ మట్టిరోడ్లగా తయారయ్యాయి. అంతేగాక కొంకల-ముండ్లదిన్నె రహదారి అధ్వాన్నంగా మారింది. శాంతినగర్ నుంచి బుడమొర్సు-తూర్పుగార్లపాడు గుంతలమయమై వాహనాలు తిరిగేందుకు ఇబ్బందికరంగా మారింది. అయిజ మండల పరిధిలోని వెంకటాపురం స్టేజీ-యాపదిన్నె, గుడిదొడ్డి రోడ్లు పూర్తిగా బీటీ తొలగిపోయి.. వర్షం పడితే బురదమయమై కుంటలను తలపిస్తున్నాయి.

తరచూ ప్రమాదాలు..

మండల పరిధిలో ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులు మట్టి రోడ్లుగా మారడంతో దుమ్ము, ధూళి రేగుతు ఎదురుగా వస్తున్న వాహనాలు అగుపించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేగాక వెంకటాపురం, గుడిదొడ్డి, జడిదొడ్డి, కిష్టాపురం, తనగల, కొంకల, ముండ్లదిన్నె, బుడమొర్సు, వడ్డేపల్లి గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు.



దుమ్ము రేగుతున్న రోడ్డు



గుంతలమయమైన తనగల రోడ్డు



నీరు నిలిచి అధ్వానంగా మారిన వెంకటాపురం స్టేజీ రోడ్డు

రైతుల ఆందోళన..

టిప్పర్లు రాత్రింబవళ్లు తిరగడంతో రహదారుల సమీపంలోని పంట పొలాలు దుమ్ము, ధూళితో పంటలు పండటం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిరప, పత్తి, మొక్కజొన్న పంటలు నష్టపోతున్నామన్నారు.

దుమ్ములోనే ప్రయాణం..



తనగల నుంచి వెంకటాపురం వెళ్లే దారిలో రాత్రింబవళ్లు టిప్పర్లు, కంకర మిషన్లు, జేసీబీలు, పెద్దపెద్ద భారీ వాహనాలు తిరుగుతున్నాయి. వాహనాల ధాటికి బీటీరోడ్డు పూర్తిగా దెబ్బతిని మట్టిరోడ్డుగా మారింది. దీంతో వాహనాలపై వెళ్లే వారికి దారి అగుపించని పరిస్థితి. ఎదురుగా వస్తున్న వాహనాలు అగుపించక తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. బీటీ రోడ్డు వేసి సమస్య పరిష్కరించాలి.

లక్ష్మీబాబు, తనగల

రోగాల బారిన పడుతున్నాం..



మా గ్రామం పక్కనే తనగల గట్టు ఉంది. గట్టు నుంచి రాత్రింబవళ్లు టిప్పర్లతో మట్టి కంకర తీసుకువెళ్తుంటారు. రోడ్డు పాడైపోవడంతో దుమ్ము, ధూళి రేగుతుంది. రోడ్డు సమీపంలో ఊరు ఉండటంతో దుమ్ము కప్పుకుంటుంది. ఇటీవల చాలా మంది ప్రజలు ఆయాసం, దగ్గు వ్యాధుల బారిన పడుతున్నారు. నాయకులు అధికారులు దీనిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలి.

రాముడు, మాజీ ఉపసర్పంచ్, కిష్టాపురం

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



ఎల్కూరులో పాఠశాలను తనిఖీ చేస్తున్న సురేష్



ఉండవెల్లి పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డీటీ వెంకట్రమణ

మల్దకల్: ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించి ప్రార్థనా సమయానికి హాజరు కావాలని ఇన్‌చార్జీ ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ఎల్కూరు ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీ మహిళలకు సూచించారు. అదే విధంగా వంట గది పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేయాలన్నారు. ఆయన వెంట సీఆర్పీలు పరమన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన..

ఉండవెల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని డిప్యూటీ తహసీల్దార్ వెంకట్రమణ పరిశీలించారు. శుక్రవారం మధ్యాహ్న భోజనంపై విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

బాధ్యతతో పనిచేయాలి..

అయిజ: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వారు అత్యంత బాధ్యతతో పని చేయాలని ఎంఈఓ రాములు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీ కోసం ఏర్పాటు చేసిన వంట సరుకులు ఎంఈఓ పరిశీలించారు. ఉపాధ్యాయులు భోజనం తయారీ విధానాన్ని పరిశీలించాలన్నారు. తాగునీరు సురక్షితంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నూతన ప్రణాళికలు చేపట్టాలి



అయిజ: ఈజీఎస్ కొత్త పనులు చేపట్టేందుకు ప్రణాళిక తయారు చేయాలని ఎంపీడీఓ వెంకటయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. రాబోయే ఐదు నెలల జాతీయ ఉపాధి హామీమి పథకంలో చేపట్టబోయే పనుల గురించి సమీక్షించారు. ఈజీఎస్ కూలీలు కొత్త పనులు చేసేందుకు ఎస్టిమేట్లు తయారు చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ రమేష్ లాల్ నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, టెక్నికల్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

రాజోళి: దివ్యాంగులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని దివ్యాంగుల హక్కుల పోరాట కమిటీ సభ్యులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం నుంచి గాంధీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. దివ్యాంగులకు రూ.4000 ఉన్న ఫింఛన్ రూ.6000 చేస్తామని చెప్పి నేటి వరకు దానిపై స్పందించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరేదాకా తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వరికొయ్యలు కాలిస్తే కాలుష్యం

మానవపాడు: వరి కోతల అనంతరం మిగిలిన వరి కొయ్యలను రైతులు అవగాహన లేక నిప్పు పెట్టి కాలుస్తున్నారని.. అలా చేయడం వలన వాతావరణ కాలుష్యం జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని మద్దూరు గ్రామంలో వరిపైరును పరిశీలించారు. వరికొయ్యలు కాల్చడంతో కాలుష్యంతో పాటు భూసారం తగ్గడం, భూమి తన సహజ స్వభావాన్ని కోల్పోతుందన్నారు. ఇది పంట దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. దానికి తోడు పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయన్నారు. వరి కొయ్యలు కలియదున్నడం వలన సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి సక్రియనాయక్

కార్యక్రమంలో రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మల్దకల్: మండల కేంద్రంలోని రైతు సంబరాల ఆవరణలో శుక్రవారం వరి కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ తిమ్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. ధాన్యాన్ని విక్రయించేందుకు వచ్చే రైతులు ఆధార్, పట్టాదారు పాస్ బుక్ జిరాక్స్‌లు వెంట తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఈఓ కిరణ్‌కుమార్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు విక్రంసింహారెడ్డి, సీతరామిరెడ్డి, పెద్ద వీరన్న, చక్రధర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి,



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ తిమ్మారెడ్డి

నరేందర్, యాకోబు, నాగరాజు, మల్దకల్, లక్ష్మణ్‌నాయక్, పరుశరాముడు, రాజు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోంది

–బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ కృష్ణ

ఎర్రవల్లి: పేదలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీఎస్పీ రాష్ట్ర ఈసీ మెంబర్ కృష్ణ అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఎస్పీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన హాజరై నూతన కమిటీలు నియమించారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా శివవర్మతేజ, ప్రధాన కార్యదర్శిగా కోళ్ల మోహన్ రాజు, ఇటిక్యాల మండల అధ్యక్షుడిగా మైఖేల్, ప్రధాన కార్యదర్శిగా సికిందర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలోపు గ్రామ స్థాయి వరకు పార్టీ నిర్మాణం జరిగేలా కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా ప్రభుత్వ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో మణికుమార్, వెంకటేష్ నాయక్, రామ్, నరేష్ కుమార్, శాంతి, రాజు, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న రాష్ట్ర నాయకులు

పాడి సంపద వృద్ధి చేసుకోవాలి



ఉండవెల్లిలో గొర్రెల కాపరులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి



బల్గెరలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరం

గట్టు : ప్రతి రైతు తప్పని సరిగా పాడి సంపద వృద్ధి చేసుకోవాలని పశువైద్యాధికారి శంకరయ్య కోరారు. శుక్రవారం బల్గెర గ్రామంలో భవిష్య భారత్.ఎల్‌టీఐ మైండ్రి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు గర్భకోశ వ్యాధి, గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. పశు వైద్య శిబిరంలో 25 పశువులకు గర్భకోశ చికిత్సలు, 78 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు వైద్యులు తెలిపారు. పశు సంపద కారణంగా కుటుంబాలు ఆర్థికంగా వృద్ధి కూడా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు శంకరయ్య, ప్రియాంక, వెటర్నరీ అసిస్టెంట్లు కనకరాజు, పృథ్వీరావు, గోపాలమిత్రలు సర్యారెడ్డి, శివశంకర్ గౌడ్, ఉరుకుంద, పరమేష్‌నాయుడు, గంగాధర్ పాల్గొన్నారు.

గొర్రెల కాపురులకు సూచనలు..

ఉండవెల్లి: మండలంలోని గొర్రెల కాపరులకు మండల పశువైద్యాధికారి శిరీష పలు సూచనలు ఇచ్చారు. శుక్రవారం గొర్రెల కాపారులు గొర్రెల వద్ద మందల వెంట వెల్లకుండా వాటి గొర్రెపిల్లలు ఉన్న చోట కుక్కలు, తదితర వేటాడే జంతువులు రాకుండా కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గొర్రెల కాపరులు, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పేదలకు అందించాలి

మల్దకల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు అందించాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణ మహరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం మల్దకల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో పేదలందరికి విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించి అన్ని విధాలా ఆదుకోవాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జుబేర్‌మొయిద్దీన్‌కు అందజేశారు. కార్యక్రమంలో కృష్ణ, రమేష్, పరుశరామ్, లక్ష్మణ్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొనుగోలు కేంద్రాలా.. రాజకీయ వేదికలా?

గద్వాల అర్బన్: సీఎం రేవంత్ రెడ్డి పాలనలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు రాజకీయ వేదికలుగా మారడం సిగ్గుచేటని బీఆర్‌ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ కుర్వ పల్లయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ఆయన మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో కొనుగోళ్లు చేశారన్నారు. గద్వాల మండలం బీరెల్లిలోని కొనుగోలు కేంద్రం వద్ద ఘర్షణ వాతావరణం నెలకొనడంతో కొనుగోళ్లు నిలిచిపోవడం దురదృష్టకరమన్నారు. నడిగడ్డలో ఆధిపత్య పోరులో రైతులు నలిగిపోతున్నారన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, బీఆర్‌ఎస్వీ నాయకులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శిస్తున్న బీఆర్‌ఎస్వీ నాయకులు

సహాయక సంఘాలతో ఆర్థిక స్వావలంభన

ఇటిక్యాల: నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు స్వయం సహాయక సంఘాల్లో చేరడం ద్వారా ఆర్థిక స్వావలంభన సాధించే అవకాశం ఉంటుందని ఐకేపీ సీసీ ఈదన్న అన్నారు. మహిళ సంఘాల వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని గోపాల్‌దిన్నే గ్రామంలో 18 ఏళ్ల నిండిన వారు సంఘంలో సభ్యులుగా చేరాలని ఇంటింటికి ఆహ్వానించారు. 10 మందితో కలిపి నూతన సంఘం ఏర్పాటు చేసుకుంటే రూ.2 లక్షల బీమా, 10 లక్షల వరకు ప్రమాదబీమా సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శులు గోవిందమ్మ, చిట్టెమ్మ, వివో రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



సంఘంలోకి మహిళలను ఆహ్వానిస్తున్న కార్యదర్శులు

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణం సాలే వీధిలోని సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమకు సాలేవీధి మహిళలు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించిన సమస్య మాత్రం పరిష్కరం కావడం లేదని ఆరోపించారు. కమిషనర్లు మారుతున్నారే తప్పా.. మా సమస్యలు పరిష్కరం కావడం లేదని అందోళన తెలిపారు. అలంపూర్ పట్టణంలోని సాలేవీధి తుంగభద్ర నదీ సమీపంలోని కోటగోడకు సమీపంలో ఉంది. ఈ కాలనీ చుట్టూ కంపచెట్లు, ముళ్ల పొదలు పెరుగుతుండడంతో విష సర్పాలు సంచరిస్తున్నాయన్నారు. ప్రభుత్వ స్థలంలో మున్సిపల్ అధికారులు ట్రీ పార్క్ ఏర్పాటు చేసి వదిలి వేయడంతో పాములకు పార్క్ నిలయాంగా మారి కాలనీలో సంచరిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వసంత, లక్ష్మీ, మీనీక్షి, సుబద్రమ్మ, జయలక్ష్మీ పాల్గొన్నారు.



మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమకు వినతిపత్రం అందజేస్తున్న సాలేవీధి మహిళలు

వైభవంగా భవానీమాత జాతర

గట్టు: మండల కేంద్రంలో జాతర సందర్భంగా గురువారం రాత్రి బస్టాండ్ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సాంస్కృతిక కార్యక్రమాలను జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాన్స్ బృందం, మిమిక్రి ఆరిస్టులు అలరించారు. కార్యక్రమంలో గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గద్దంకృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, మోహన్‌గౌడు, రాజప్ప, బజారి, సంతోష్, ప్రాణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు..

జాతర సందర్భంగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. మాజీ సర్పంచ్ ధనలక్ష్మీ పోటీలు నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఆలయం ఎదుట కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశారు. కబడ్డీ పోటీలను తిలకించేందుకు చుట్టు గ్రామాల నుంచి జనాలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

జాతరలో జన కోళాహలం..

మండల కేంద్రంలోని శ్రీభవానీ మాత జాతర జనంతో కిటకిటలాడుతోంది. శుక్రవారం అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర ఆవరణలో దుకాణాలు జనాలతో కిక్కిరిసిపోయాయి. ఆనందోత్సవాలతో సందడిగా గడిపారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



కబడ్డీ పోటీలు



విక్రయ దుకాణం వద్ద మహిళలు